www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 సెప్టెంబర్ 2025
5
అన్నమయ్య





మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ఉల్లి రైతు కన్నీరు!





రోడ్డుపైన పారబోసిన ఉల్లిని మోటర్ సైకిల్‌పై తీసుకెళుతున్న ప్రజలు

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని నానుడి. ఉల్లి పంట సాగుకు రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ప్రకృతి ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచారు. ఆశల పంటను కాపాడుకోవడానికి ఆరుగాలం శ్రమించారు. దిగుబడి చేతికందే సమయంలో బహిరంగ విఫణిలో ధరలు పతనం కావడంతో రైతుల కంట కన్నీరు ఉబికివస్తోంది. గత ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో విస్తారంగా సాగు చేశారు. పైరు కాలం ముగిసి దిగుబడి చేతికందే సమయంలో ధరలు సగానికి పైగా పడిపోవడంతో నష్టాలపాలయ్యారు.

కల్లాలు దాటక..కన్నీళ్లు ఆగక
బహిరంగ విపణిలో ధరల పతనం
ఉల్లిని రోడ్డుపై పారబోస్తున్న రైతులు
రైతులకు తప్పని కష్టాలు..
నిల్వ చేయలేక అవస్థలు
ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి-సింహాద్రిపురం

జిల్లాలో ఉల్లి రైతులకు కన్నీరు పెట్టుకునే పరిస్థితి దాపురించింది. ఉల్లి రైతుకు ఈ ఏడాది కష్టకాలం వచ్చింది. ఒకవైపు అధిక వర్షాలు..మరోవైపు విఫణిలో ధరాఘాతంతో ఉల్లి రైతు కంట కన్నీరు పెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో కొందరు పొలాల్లోనే గొర్రెలు, మేకలు, పశువులకు వదిలేస్తున్నారు. మరికొందరు ఉచితంగా తెచ్చుకోండంటూ గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. మరి కొందరు పొలం, రోడ్లపై పడవేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలలో 1500 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. మండలంలోని అహోబిలంకు చెందిన రైతు అంకాలరెడ్డి మూడు ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. ఎకరా ఉల్లి పంటను సాగు చేయడానికి విత్తనాలు, కలుపుతీత ఖర్చులు, ఎరువులు, క్రిమిసంహారక మందులతో పాటు ఇతరత్రా పెట్టుబడులు దాదాపు రూ.1.25 లక్షలు ఖర్చు చేశారు. తీరా పంట చేతికి వచ్చాక ధరల అమాంతంగా తగ్గిపోయాయి. క్వింటాల్ ఉల్లి రూ.వెయ్యి చొప్పున విక్రయాలు జరుగుతుంటే ఐదు ట్రాక్టర్ ట్రాలీలు గడ్డలను కోశారు. వీటిని పీకడానికి, తోకలు కోయడానికి మరో రూ.40 వేల ఖర్చు చేశారు. తీరా ఉల్లి అమ్ముదామనుకున్న సమయంలో క్వింటాల్‌కు వ్యాపారులు రూ.750 అడగడంతో మరో రోజు వేచి చూశారు. మరుసటి రోజు మార్కెట్ మరింత పతనమైందని ఇప్పట్లో కొనుగోలు చేసే పరిస్థితి లేదని వ్యాపారస్తులు చెప్పారు. మరో నాలుగు రోజులపాటు రైతు వేచి చూసిన ఉల్లిని చెప్పుకోవడానికి ఇబ్బందికరంగా ఉన్న ధరలకు వ్యాపారులు అడగడంతో చేసేది లేక పది టన్నులు రోడ్డుపైన పారబోశారు.

ఉల్లిని ఉచితంగా తీసుకెళ్లిన ప్రజలు

మార్కెట్లో ధరలు పతనం కావడంతో వ్యాపారస్తులు ఎవరు కొనుగోలుకు రాకపోవడంతో చేసేది లేక రైతు రోడ్డుపైన పారబోయడంతో ఆరు గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి తీసుకెళ్లారు. రైతు అంకాలరెడ్డి ఉల్లిని రోడ్డుపైన పారపోసిన విషయం తెలియగానే స్థానిక గ్రామస్తులతో పాటు, తెలికి, రావులకొలను, జంగంరెడ్డిపల్లె, సుంకేసుల, ముసల్‌రెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు మోటర్ సైకిల్, ట్రాక్టర్లు వేసుకుని ఉల్లిగడ్డలను తీసుకోవడానికి తండోపతండాలుగా తరలివచ్చారు. బాధిత రైతే స్వయంగా తన సన్నిహితులు, శ్రేయోభిలాషులకు సైతం ఫోన్ ద్వారా ఉల్లిగడ్డలకు ధర లేకపోవడంతో రోడ్డుపైన పోశానని వచ్చి వాటిని ఉచితంగా తీసుకెళ్లాలని తెలియజేశారు. నాలుగు రోజుల క్రితం ఓ రైతు మార్కెట్‌కు ఉల్లిగడ్డలను లారీలు ఎత్తుకెళ్లి అక్కడ విక్రయించితే లారీ బాడుగ సైతం రాదని రోడ్డుపైన పారబోసిన విషయం సోషల్ మీడియాలో వైరలైంది. అలాంటి సంఘటనే మండలంలోని అహోబిలంలో జరగడంతో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ?

రైతే రాజు, దేశానికి రైతే వెన్నెముక అన్న స్లోగన్లు కనిపిస్తున్నాయా తప్ప వాస్తవంగా ధరలు లేనప్పుడు ధరల స్థిరీకరణ నిధి నుంచి ఆదుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వాలు మాత్రం సంక్షేమం పేరుతో ఉచితంగా పథకాలు ఇస్తున్నారు తప్ప రైతులను ఆదుకోవడంలో తీవ్రంగా విఫలమయ్యారని విశ్లేషకులు చెబుతున్నారు. మరో నేపాల్ ఆంధ్రప్రదేశ్ కాకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రజల సంక్షేమంతో పాటు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వారి అభ్యున్నతికి దోహదపడాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం ధర లేక ఉల్లి, టమోటాతోపాటు అరటి, చీనీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడులు సైతం రాక చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమనే స్థితికి వచ్చారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పెద్ద ఉల్లిగడ్డలను ఏరుకుంటున్న మహిళలు

ధర లేకనే రోడ్డుపైన పారబోశా

ఉల్లి పంటకు వ్యాపారస్తులు అడుగుతున్న ధరల కంటే రోడ్డుపైన పోసి ఉచితంగా ప్రజలకు ఇవ్వడం మంచిదని ఆలోచించి రోడ్డుపైన పారబోశాం. ఇలాంటి విపత్కర పరిస్థితులు రైతులకు ఎప్పటికీ రాకూడదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర లేని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలి.

- అంకల్‌రెడ్డి, బాధిత రైతు, అహోబిలం.

జిఒ రాకపోవడంతో కొనుగోలు చేయలేదు

ప్రభుత్వ ప్రకటించిన విధంగా జిఒ రాకపోవడంతో మార్క్‌ఫైడ్ ఆధ్వర్యంలో ఉల్లి కొనుగోలు చేయలేదు. జిఒ రాగానే కిలో ఉల్లి రూ.12లతో కొనుగోలు చేస్తాం. అహోబిలంలో రైతు పారబోసిన విషయం మా దృష్టికి వచ్చింది. ఆ రైతును ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి, ముద్దనూరు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో

ప్రభుత్వం హోర వైఫల్యం

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు బి.కె.సురేష్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

గత ప్రభుత్వం మాదిరే కూటమి ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని యుటిఎఫ్ రాష్ట్ర సహాఅధ్యక్షులు కె.సురేష్ కుమార్ విమర్శించారు. ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ చేపట్టిన రణభేరి జాత బుధవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి చేరుకుంది. ఉపాధ్యాయులు రాయచోటి రింగ్ రోడ్డు నుండి బైక్ ర్యాలీ శివాలయం, బంగ్లా సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్ల మీదుగా డిఇఒ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా రంగంపై చిన్న చూపు చూస్తూ, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రావాల్సిన బకాయిలతోపాటు ఈ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వా ల్సిన ఆర్థిక బకాయిలు ఇవ్వలేదని పేర్కొన్నారు. నాలుగు విడతల డిఎ ఇవ్వలేదన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించడంలోనూ నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఆర్ ప్రకటించాలని, గ్రాట్యుటీ, మెడికల్ రీయింబ ర్స్మెంట్, ఈహెచ్‌ఎస్ సమస్యలు, మోడల్ స్కూల్ సమస్యలను పరి ష్కరించాలని పేర్కొన్నారు. భాషా పండితుల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా బోధనేతర పనులు ఉపాధ్యాయులతో చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సంఖ్యను కుదించి ఉన్న వారిపై భారం మోపడం సరికాదని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి జాత చేపట్టామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి అసెంబ్లీ, క్యాబినెట్ సమావేశాల్లో చర్చించి సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహణ ద్వారా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్, యుటిఎఫ్ కార్యదర్శులు లక్ష్మీరాజా, కడప జిల్లా కార్యదర్శి జయచంద్రారెడ్డి, మోడల్ స్కూల్ టీచర్ల రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి దావూద, ఆదినారాయణ సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, యుటిఎఫ్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్ నాగరాజు

ఉచిత ప్రయాణంపై మహిళల సంతృప్తి

- ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఉచిత ప్రయాణం పట్ల మహిళలు సంతృప్తితో ఉన్నారని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ నాగరాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా మహిళలకు వర్తిస్తున్న ఏకైక పథకం స్త్రీశక్తి పథకమని తెలిపారు. ఇప్పట ివరకు 1.82 మంది మహిళలు ప్రయాణించారని చెప్పారు. నెల రోజుల్లో రూ.82 కోట్లను మహిళల కోసం ప్రభుత్వం భరించిందని పేర్కొన్నారు. రూ.240 కోట్ల ఆదాయంలో రూ.82 కోట్లు ప్రభుత్వం మహిళల ప్రయాణం కోసం భరిస్తూ ఉందని చెప్పారు. జోన్లో 3,236 బస్సులు ఉన్నాయని తెలిపారు. స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి బస్టాండుల నిర్వహణలో అనేక మార్పులు చేశామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ ఉందన్నారు. అనంతపురంలో నిర్వహించిన కూటమి మహాసభ, మహానాడుకు ఆర్టీసీ బస్సుల సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. మహానాడు ద్వారా ఆర్టీసీకి రూ.20 కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 ఏళ్లు దాటిన బస్సులను నడపడం లేదని తెలిపారు. బస్సుల కొరత ఏర్పడుతుందని చెప్పారు. 600 బస్సులు అవసరం ఉందని, డ్రైవర్లు కండక్టర్ల కొరత ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఇడి చంద్రశేఖర్, ఆర్ఎం గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్‌టిసి జోనల్ వర్క్‌షాప్‌ను చైర్మన్ సందర్శించారు.



పెరియార్‌కు నివాళి అర్పిస్తున్న బాస్, విసికె నేతలు

సాంఘిక విప్లవ యోధుడు పెరియార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశ జనాభాలో తొంబై శాతానికి పైగా ఉన్న అణగారిన ప్రజల ఆత్మగౌరవ పతాక పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకర్‌అని, ఆయన 147వ జయంతిలో విడుదలై చిరుతైగల్ కట్చి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ అన్నారు. పెరియార్ జయంతిని పురస్కరించుకొని, బుధవారం స్థానిక బాస్ కార్యాలయంలో విసికె, బాస్ సంయుక్తంగా సంస్మరణ కార్య క్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ దేవుడి పేరుతో, మతం పేరుతో పురోహిత వర్గం చేసే మోసాలను, దోపిడీని పెరియార్ తీవ్రంగా ఎండగట్టారన్నారు. బ్రాహ్మనేతర కులాలకు కోటా పద్ధతి (రిజర్వేషన్ల) కోసం ఆయన పోరాటం చేశారన్నారు. అంటరానితనం, అంధవిశ్వాసాల నిర్మూలన కోసం రాజీలేని పోరాటం చేశారని తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రులైన కామరాజ్, అన్నాదురై, ఎంజిఆర్, కరుణానిధి, జయలలిత, స్టాలిన్ అందరూ ద్రవిడ పార్టీల నుంచే వచ్చారని చెప్పారు. దేశ ప్రజలకు పెరియార్ అందించిన బహుముఖ సేవలను, హేతువాద వైఖరిని గుర్తించిన యునెస్కో, పెరియార్‌ను సౌత్ ఆసియా సోక్రటీస్‌గా ప్రకటించి, గౌరవిం చిందని చెప్పారు. కార్యక్రమంలో బాస్, విసికె నాయకులు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, టి.ఎ. పీర్‌బాషా, సొన్నికంటి రెడ్డెప్ప, కె.టి. శేఖర్, దేగాని రమణ, వై. గంగాధర్, రవిశంకర్, తలారికృష్ణ, బురుజు రెడ్డిప్రసాద్, బి.నరసింహులు, ప్రశాంత్, చంద్ర, మురళి, కిరణ్ పాల్గొన్నారు. **పీలేరు:** సాంఘిక విప్లవ యోధుడు తంద్రై పెరియార్ అని అన్నమయ్య జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. తంద్రై పెరియార్ 146వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని భాస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బాస్ నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ మూఢనమ్మకాలను వ్యతిరేకించి, బ్రాహ్మణ వ్యవస్థపై పెరియార్ తిరుగుబాటు చేశారని అన్నారు. సనాతన ధర్మంలోని పూజారి వ్యవస్థను, కుల నిర్మూలన, దేవదాసి వ్యవస్థను, ఆలయ ప్రవేశ వ్యవస్థను మతమాచారం పేరుతో జరుగుతున్న స్త్రీ అణిచివేతను, అంటరానితనాన్ని రూపుమాపడానికి ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో బాస్ నాయకులు పల్లెపోగు హరినాథ, గుండ్లూరి రవీంద్ర, ముల్లంగి గురవయ్య, సాదు రామానుజులు, సురేష్, నవీన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మను ఆదర్శంగా తీసుకోవాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

రకరకాల వృత్తులకు ఆద్యుడైన వాస్తుశిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని చేతి, కుల వృత్తుల వారు తమలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డిఆర్‌ఒ మధుసూదన్‌రావు తెలిపారు.బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఈ వేడుకలకు డిఆర్‌ఒ ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ ప్రోగ్రాంను రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ప్రోగ్రామ్‌గా ప్రతి ఒక్క జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. విశ్వకర్మను దివ్య వడ్రంగి అని కూడా భావిస్తుంటారన్నారు. కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాంతాలలో ఇంజి నీరింగ్, ఆర్కిటెక్చరల్ వాళ్ళు మాత్రమే కాకుండా వడ్రంగులు, చేతివృత్తుల వారు, హస్తక ళాకారులు, మెకానిక్స్, స్మిత్‌లు, వెల్డర్లు, పారిశ్రామిక కార్మికులు, ఫ్యాక్టరీ కార్మి కులు మొదలైన వారు ఆయనను భగవంతుడిగా భావిస్తుంటారని, కార్మికులు విశ్వకర్మను కొలిచి తమ పరిక రాలను, పని ముట్లను పూజిస్తారన్నారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి సురేష్, కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు, చేతి కుల వృత్తుల సభ్యులు పాల్గొన్నారు.

నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టరుగా సిటిఎం పంచాయతీకి చెందిన టిడిపి సీనియర్ నాయకులు చల్లా నరసింహులు నియమితులయ్యారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే షాజహాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. చల్లా నరసింహులును పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపికి చల్లా విశేషమైన సేవలు అందించా రన్నారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరుగా నియమించడం శుభ పరిణామమన్నారు.పార్టీలో నిస్వార్థంగా పనిచేసిన వారికే అధిక ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం నరసింహులు మాట్లాడుతూ తనను మార్కెట్ కమిటీ డైరెక్టరుగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాలకు కృతజ్ఞతలు తెలి పారు.మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎంపికైన బి.శ్యామలమ్మ, మునుస్వామి నాయక్, సీనియర్ నాయకుడు రెడ్డిరాంప్రసాద్‌ను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

'స్వచ్ఛతా హి సేవ'లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవ ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మునిసిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు సమిష్టిగా పనిచేసి మదనపల్లికి స్వచ్ఛతా హి అవార్డులను తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కమిషనర్ కె.ప్రమీల మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబర్ 2వరకు స్వచ్ఛత హి సేవ నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి మధుసూదన్ రెడ్డి, టిడిపి నాయకులు ఎస్.ఆర్ షంషీర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామిశెట్టి ఆంజనేయులు, చేనేత విభాగం రాష్ట్ర నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, మండిపల్లి మధుసూదన్‌రెడ్డి, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, డ్యాన్స్ రెడ్డెప్పపాల్గొన్నారు.

ప్రవేష్ సర్టిఫికెట్స్ పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి ప్రవేష్ సర్టిఫికెట్స్ పంపిణీ చేసినట్లు జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు.జిల్లాలోని 262 పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లలో దాదాపు 2500 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేసినట్లు చెప్పారు. వీరికి మరొక ఆరు నెలల శిక్షణ అనంతరం మార్చిలో ప్రథమ సోపాన్ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు మహమ్మద్ ఇలియాస్, చంద్రశేఖర్, గైడ్ కెప్టెన్లు సుజాత, రాజేశ్వరి, డైట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



మాట్లాడుతున్న చైర్మన్ ఫయాజ్‌బాషా

ఎజెండాలో 27 అంశా లున్నా మూడు, నాలుగు మినహా ఎలాంటి చర్చా లేకుండానే అన్ని అంశాలను ఆమోదిం చారు. రాయచోటి మున్సిపల్ సభా భవనంలో బుధవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశం సాదా సీదాగా ముగిసింది. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కాగా వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలు, పట్టణాభి వృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా కౌన్సిలర్లకు సూచించారు. కొన్ని అంశాలకు 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆ పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. గతంలో గుంతబజార్‌లో డ్రెయినేజీ పనులు కాకపోగా దీన్ని మళ్లీ ఎలా పెడతారని ప్రశ్నించారు. గతంలో చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు ఇవ్వలేదని కొత్త పనులకు ఎలా చేపడతారన్నారు. కొందరు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ రవిని తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఎవరు కూడా అభివృద్ధి పనులు చేపట్టడానికి అడ్డంకి కాదని, 15వ ఆర్థిక సంఘం నిధులు కాకుండా స్పెషల్ గ్రాంటు కింద ఆ పనులు చేయాలని సూచించారు.అనంతరం అజెండాలలోని 27 అంశాలలో మూడు, నాలుగు అంశాలు తప్ప మిగితా అంశాలు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో సమావేశం ముగిసింది. సమావేశంలో వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహ్మాన్, కౌన్సిలర్లు హరున్‌బాషా, ఈశ్వర్ ప్రసాద్, అన్నా సలీం, సాధక్ అలీ, జానం రాధ, విజయమ్మ, లక్ష్మీ దేవి, మదన్ మోహన్ రెడ్డి, కొలిమి చాన్‌బాషా, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలు స్వయంకృషితో సాధికారత వైపు అడుగులు వేయాలని ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి అన్నారు. స్థానిక చారిత్రాత్మక అనిబిసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో భారత ఆర్థికాభివృద్ధిలో మహిళా సాధికారత నూతన దృక్కోణం అనే అంశంపై బుధవారం జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభాకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లుగా మహిళలు మగవారి వెన్ను దన్ను లతో ఎదుగుతూ వచ్చారని ఇకపై వారు స్వయంకృషితో సాధికారత సాధించాలని పిలు పునిచ్చారు. కార్యక్రమ అధ్యక్షురాలు, బి.టి.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు ఎటువంటి పరిస్థితుల్లోనూ భయపడరాదని తాము చేపట్టిన పని విజయవంతమయ్యేంత వరకు ప్రాణాలు పోయినా సరే పోరాడాలని, పోరాడుతూనే ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యా ర్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా విచ్చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు జి.రామచంద్రారెడ్డిని దుశ్శాలువాతో సన్మానించారు.

బాలిక మృతిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణ ప్రాంతంలోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపి మృతికి గల కారణం తెలపాలని పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది రెడ్డయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక తరగతి గదిలో క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తోందని, బాలిక సొంత ఊరు ఎండపల్లి అయినప్పటికీ విద్యాభ్యాసం దృష్ట్యా బాలిక తల్లిదండ్రులు రాయచోటి పట్టణంలో ఎన్‌జిఒ కాలనీలో నివాసం ఉంటూ బాలికను చదివిస్తున్నారని తెలిపారు.ఈనెల 15న ఉదయం 10 గంటల ప్రాంతంలో బాలిక తల్లి తన పని ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా బాలిక ఉరికి వేలాడుతూ కనిపించడంతో ఇరుగుపొరుగు వారిని పిలిపించి స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే బాలిక మృతి చెందిందని పేర్కొన్నారు. బాలిక మృతి పట్ల రాయచోటి తహశీల్దార్ బాలిక కుటుంబాన్ని పరామర్శించగా మంగళవారం బాలిక మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించారన్నారు. బాలిక తల్లిదండ్రులను పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులను కడప ఉమ్మడి జిల్లాల పౌర హక్కుల సంఘం నాయకులు విచారించి బాలిక మృతిపై అనుమానాలను అన్ని కోణాల నుంచి విచారించి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరారు. పేదవారు అయిన వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

'శ్రీసాయి'లో ఘనంగా 'స్వాగత్-2కె25'

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం ఎంబిఎ విద్యార్థుల కోసం 'స్వాగత్-2 కె 25' ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త, కన్యకా పరమేశ్వరి దేవాల య చైర్మన్ పబ్బిశెట్టి సురేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో యువజన శాతం అత్యధికమని, క్రమశిక్షణతో పాటు అంకితభావంతో ముందుకు సాగితే లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నత స్థానాలకు చేరి, మేనేజ్మెంట్ రంగంలో లభ్యమయ్యే అధిక వేతన ఉద్యోగాలను వినియోగించుకోవాలని సూచించారు. డిజిటల్ రంగం కీలకపాత్ర పోషిస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఉపయోగించి పారి శ్రామికవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ హీరా రాజ్‌పుత్ మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం ఉద్యోగ అవకాశాల కోసం కావలసిన మౌలిక వసతులు కళాశాలలో కల్పించామని, సెమినార్లు, వెబినార్లు, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణల ద్వారా పరిశ్రమలకు తగిన విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మేనేజ్మెంట్ రంగం ఉత్పాదకత పెంపుదలలో కీలకమని, భారత్ పెట్టుబడుల స్వర్గధామంగా మారిందని, ఇ-కామర్స్, అకౌంటెన్సీ, బ్యాంకింగ్, మార్కెటింగ్ రంగాలలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీ. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ, రోటరీక్లబ్ సభ్యుడు అష్రఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న ఎం.జి.పురం గ్రామస్తులు

'చమర్తి'కి సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తమ గ్రామంలో ఎప్పటి నుండో ఉన్న నీటి సమస్యకు రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు పరిష్కారం చూపారని ఎం.జి పురం గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం జగన్‌మోహన్‌రాజును ఎం.జి పురం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య లేకుండా చేయడంలో చమర్తి గ్రామంలో తమకు మద్దతుగా నిలిచారన్నారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ గ్రామాలలో ఏటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని, ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా పయనించాలన్నదే తన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, సర్పంచ్ బాసెట్టి వెంకటసుబ్బయ్య, గ్రామ టిడిపి అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి రమేష్, నీటి సంఘం అధ్యక్షులు బాసెట్టి వెంకటసుబ్బయ్య, కో-కన్వీనర్ కోటకొండ కృష్ణయ్య, బూత్ కన్వీనర్లు వెంకటసుబ్బయ్య, నాగ సుబ్బారెడ్డి, సంగరాజు వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

పట్టణంలో విశ్వకర్మ జయంతి వేడుకలను పంచముఖ విశ్వబ్రాహ్మణ సంఘం ఘనంగా నిర్వహించింది. సంఘం అధ్యక్షుడు హేమాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విశ్వబ్రాహ్మణులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని విశ్వకర్మస్వామి చిత్రపటాన్ని పట్టణంలో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు హేమాచారి మాట్లాడుతూ విశ్వకర్మ కేవలం దేవతల శిల్పి మాత్రమే కాదని, మొదటి ఇంజినీర్, వాస్తుశిల్పి అని పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతిని జరుపుకోవడం ద్వారా మనం మన వృత్తికి, నైపుణ్యానికి గౌరవం ఇవ్వడమేనని, నేటి యువత విశ్వకర్మ ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గోపిచారి, అప్పచారి, ఉపాధ్యక్షుడు మహేష్ ఆచారి, సంఘం సభ్యులు రత్నమాచారి, సిద్ధప్పాచారి, రుద్రచారి, జయచారి, మోహనచారి, వీరబ్రహ్మాచారి, లోకేష్, వెంకటరమణ, మల్లికార్జున, ధీరజ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

చిరుధాన్యాలతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రెడ్డి సర్దాజ్ అంగన్వాడీ కార్యకర్తలకు, తల్లులకు సూచించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు వాల్మీకిపురం పరిధిలో బుధవారం మండలంలోని తూర్పుపల్లి అంగన్వాడీ కేంద్రంలోని పౌష్టిక ఆహారం మహోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ఇవ్వడం గురించి వివరిం చారు. పోషక ఆహారంతో కూడిన వంటలు తల్లులు దగ్గర తయారు చేయించి పోటీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలలో దొరికే ఆకుకూరలు, కూరగా యలు, చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సద్దలును మనం తినే ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కెబి సాగలక్ష్మి, ఎఎన్ఎం దీనాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త రెడ్డమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

పీలేరులో 92 మి.మీ వర్షపాతం నమోదు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో 92 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని ఎఎస్‌ఒ రెడ్డప్ప నాయుడు తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కూడా పీలేరులో ఓ మోస్తారుగా వర్షం కురిసింది. స్థానిక రెవెన్యూ కార్యాలయ ఎఎస్‌ఒ ఇచ్చిన వివరాల మేరకు పీలేరు నియోజకవర్గం పరిధిలోని పీలేరులో 92 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కెవి పల్లిలో 65 మిల్లీమీటర్లు, కలికిరిలో 56 మిల్లీ మీటర్లు, కలకడలో 45.8 మిల్లీమీటర్లు, వాల్మీకిపురంలో 15.6 మిల్లీమీటర్లు, గుర్రంకొండలో 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - నందలూరు

రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడును సాధించవచ్చని రాజంపేట వ్యవసాయ సంచాలకులు శివశంకర్ పేర్కొన్నారు. మండలంలోని పొత్తపి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పొలాలను పరిశీలించి ఆ తర్వాత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులోని మెలకువలను గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. తర్వాత ఈ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ పరి శోధన స్థానం ,కడప నుంచి వచ్చిన శాస్త్రవేత్త పి.శ్రీవల్లి మాట్లాడుతూ ముంపుకు గురైన పొలాలలో నీరు తగ్గిన తర్వాత ఆజాక్సిస్ట్రోబిన్ ం టేబుకోనజోల్ 1.5 మిల్లీలీటర్లు, 13:0:45 10 గ్రామ్స్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పంటలకు వచ్చే తెగుళ్ల గురించి అవగా హన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు భరత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వత్తలూరు జడ్‌పి హైస్కూల్‌లో గత మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాలు సంపాదించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిం చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిసి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో గుండ్రాజు రామ్మోహన్ రాజు తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా వారి కుమారుల సమక్షంలో నగదు ప్రోత్సాహకాలు అందించడం జరిగింది. మొదటి బహుమతి రూ.5016, రెండవ బహుమతి రూ.3016, మూడో బహుమతి రూ.2016 విద్యార్థులకు అందజేశారు. రాజంపేట ఎంఇఒగా పనిచేస్తున్న సుబ్బరాయుడు కూడా మొదటి, రెండవ, మూడవ స్థానాలలో వచ్చిన విద్యార్థులకు రూ.1500, రూ.1000, రూ.500 నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో డిఇ శశిధర్ రాజు , ఎపి ట్రాన్స్‌కో భానుమూర్తి రాజు, ప్రొఫెసర్ , పుల్లంపేట ఎంఇఒ చక్రధర్‌రాజు , రాజంపేట డివిజన్ డిప్యూటీ డిఇఒ నాగయ్య, ఎంఇఒ రఘునాథ్, అనంతంపల్లి ప్రధానోపాధ్యాయులు ఫణీంద్ర, ఓబులవారిపల్లి ప్రధానో పాధ్యాయులు సిపి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కేసులు నమోదు

ప్రజాశక్తి- కలకడ


హోటళ్ల యజమానులకు సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ

హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వాడితే యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన కలకడ గ్రామపంచాయతీ నందు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు సంబంధిం హోటళ్ల యజమానులతో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆహార పదార్థాలు తిన్న తర్వాత వచ్చే వ్యర్థ పదార్థాలను డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలని, ప్లాస్టిక్ బదులుగా అరిటాకులు మాత్రమే వాడాలని సూచించారు. కలకడ గ్రామపంచాయతీలో 20వ తేదీ నుంచి పది మండలాల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ లకు ఎస్ డబ్ల్యూ పిసిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు సంబంధించి ఎస్‌డబ్ల్యూపిసిలో గ్రామపంచాయతీ చేయాల్సినటువంటి ఆక్టివిటీస్ పైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శానిటరీ లకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, సర్పంచ్ ప్యారిజాన్ జావిద్, బిల్ కలెక్టర్ హరిబాబు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వర్షం వచ్చిందంటే..బస్టాండ్ మునగాల్సిందే

- వ్యాపార సముదాయాల్లోకి చొచ్చుకు వచ్చిన నీరు
- తడిసి నష్టపోయామంటున్న చిరువ్యాపారులు
- సమస్య పరిష్కారానికి కృషి చేసిన పారిశుధ్య కార్మికులు
- వర్షం కురిసిన ప్రతిసారీ పీలేరులో ఇదే దుస్థితి


వర్షపు నీటితో నిండుకున్న పీలేరు ఆర్‌టిసి బస్టాండు

ప్రజాశక్తి-పీలేరు

కాస్త వాన కురిస్తే చాలు, వర్షం నీరు వరదలా పారుతుంది. లోతట్టు ప్రాంతాలు నీటితో నిండి, చెరువులను తలపిస్తుంది. మురుగునీటి కాలువల్లో చెత్తా - చెదారాలు అడ్డుపడి నీరు రోడ్లపై పొర్లుతాయి. వాహనాల రాకపోకలతో పాటు పాదచారులకు సైతం అసౌకర్యంగా మారుతుంది. ఇది ఎక్కడో సముద్ర తీరాల్లోనో లేక జీవ నదుల గట్ల పక్కలోనో చోటు చేసుకుంటున్న సంఘటనలు కాదు. దినదినాభివృద్ధి చెందుతూన్న పీలేరు పట్టణంలో వర్షం కురిసిన ప్రతిసారీ స్థానిక ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటూన్న ఇబ్బందులివి. పీలేరు ఆర్‌టిసి బస్టాండుకు ఎగువన ఉన్న నివాస ప్రాంతాల నుంచి, వర్షం కురిసిన ప్రతిసారీ వచ్చే వర్షపు నీటితో బస్టాండు నీటి కుంటను తలపిస్తుంది. చెత్తాచెదారాలతో మురుగునీటి కాలువలు నిండుకుని, మురుగునీరు కాస్తా పొంగి రోడ్లపై పొర్లుతుంటాయి. దీంతో అటు ఆర్‌టిసి వాహనాలకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతోంది. అలాగే ఇటు మురుగునీరు రోడ్లపైకి వస్తుండడంతో వాహనాల రాకపోకలు, పాదచారులకు ఇబ్బందిగా పరిణమిస్తోంది. మరోవైపు బస్టాండు, పరిసరాల్లోని వ్యాపార సముదాయాల్లోకి కూడా వర్షపు నీరు చొచ్చుకొస్తుండడంతో వారు పడే కష్టం, ఎదుర్కొనే నష్టం చెప్పలేనంత. సమస్య ఉన్నపుడు స్పందించే అధికారులు, ప్రజాప్రతినిధులు ఆపై మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలూ వస్తున్నాయి. బస్టాండుకు చేరుతున్న వర్షపు నీరు సులభంగా అవతలి వైపుకు వెళ్లేలా పైపులైను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు భావించారు. అందుకు సంబం ధించి పలుమార్లు పరిసరాలను పరిశీలించి కొలతలు కూడా తీశారు. అయితే అది కాస్తా ఆచరణకు నోచుకోకపోతుండడంతో ఆర్‌టిసి వాహనాలతో పాటు ప్రయాణికులు, ఆర్‌టిసి సముదాయాల్లోని చిరు వ్యాపా రులు అనేకానేక ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండు పరిసరాల్లోని కొందరు వ్యాపారులు వ్యర్థాలను తీసుకొచ్చి బస్టాండు ప్రాంగణంలో నిర్లక్ష్యంగా పడేస్తుండడం, ఆ చెత్తాచెదారాలు గాలికి ఎగిరి ఆర్‌టిసి ప్రాంగణంలోని కాలువల్లో పడి పేరుకుపోతున్నాయని తెలిపారు. మురుగునీరు, వర్షపు నీరు కాలువల్లో సునాయాసంగా ప్రవహించడానికి వీలుకాకుండా అవి అడ్డుపడుతున్నాయని ఫలితంగా మురుగునీరు ప్రవహించడానికి ప్రత్యామ్నాయ మార్గం లేక రోడ్లపైకి పొంగి పార్లే పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైన ప్రతిసారి కూడా గ్రామ పంచాయతీ కార్మికులు వచ్చి మురుగునీటి కాలువల్లో అడ్డుపడిన చెత్తా చెదారాన్ని తొలగించే ప్రక్రియ చేపట్టక వారికి తప్పడం లేదు. ఇప్ప టికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టి బస్టాండు, పరిసరాల్లో వర్షపు నీరు, మురుగునీటి సమస్యలు పున రావృతం కాకుండా చూడాలిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌టిసికి అద్దె కడుతున్నా తగిన సౌకర్యాలు లేవు

ఆర్‌టిసికి నెలనెలా అద్దెలు కడుతున్నా వారు తమకు తగిన సౌకర్యాలు సమకూర్చడం లేదని, సమస్యలు వచ్చినప్పుడు స్పందించి వాటిని పరిష్కరించడం లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ వ్యాపారులందరూ వారి దుకాణాల్లో చేరిన వర్షపు నీటిని, బురదను తొలగించుకోక తప్పడం లేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పడే కష్టాన్ని, ఎదుర్కొనే నష్టాన్ని కూడా ఆర్‌టిసి అధికారులు గుర్తించడం లేదని వ్యాపారులు అంటున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తమ దుకాణాల్లోకి నీరు వచ్చేసిందని, తాము పలు వస్తువులను నష్టపోయామని సంబంధిత సిఐ, బస్టాండ్ మేనేజర్లకు సమాచారం ఇవ్వడం కోసం ఫోన్లు చేసినా ఫలితం లేకుండా పోయిందని బాధను వ్యక్తం చేస్తున్నారు.


బస్టాండ్ సమీపంలో రోడ్డుపై పొర్లుతున్న మురుగునీరు


కాలువల్లో పూడికను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య


రాయచోటి : కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ లక్ష్మీ నరసయ్య

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించడం ద్వారానే కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ప్రభుత్వం స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డిఎంహెచ్‌ఒ లక్ష్మీ నరసయ్య తెలిపారు. ం పట్టణంలోని ప్రభు త్వ ఏరియా ఆసుపత్రిలో ఆయన డిసిహెచ్ఎస్ ఆంజనేయులు తో కలిసి స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, సమయానుకూల వైద్య సేవ అందించడం, పోషకాహారాన్ని ప్రోత్స హించడం, కుసుంబాలను స్వశక్తి చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాల ను ప్రత్యేక వైద్యనిపుణులు , పారామెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వైద్యశాఖ, మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, మున్సిపల్, డిఆర్‌డిఎ శాఖల సమన్వయంతో బృహత్తర కార్యక్రమం నిర్వహించబడుతుందంటూ చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ స్టేట్ అబ్జర్వర్ శ్రీ మధుకర్, డాక్టర్ డి సంధ్య ,ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్, డిఐఒ డాక్టర్ ఉషశ్రీ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, ఆర్ఎంఒ డాక్టర్ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ కె.హైమావతి, దేవశిరోమణి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మహిళ లు, పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** మహిళలు, చిన్న పిల్లలు, ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఆనందంగా, సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రం నిమ్మనపల్లిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ఈ కార్యక్రమాన్ని జరుగుతున్నట్లు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ముందుకు సాగాలని మహిళలను కోరారు. ఇందులో భాగంగా రక్తపు పోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, పోషణ అభియాన్, సరైన ఆహారం తీసుకోవాలన్నారు. , తల్లి బిడ్డ సేవలు, వయో వృద్ధుల ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరిక్షలు, క్షయవాది స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మహిళలే కాకుండా అందరూ వచ్చి తమ ఆరోగ్యాన్ని పర్యవేక్షించుకోవాలని కోరారు. కార్యక్రమములో డాక్టర్ ప్రత్యుష, సూపర్వైజర్స్, సిహెచ్‌ఒలు, స్టాఫ్ నర్సులు, ఆశ కార్యకర్తలుపాల్గొన్నారు. **రామాపురం :** ఆరోగ్యవంతమైన మహిళ తన తన కుటుంబ సభ్యులను ఆరోగ్యపరంగను ఆర్థికంగాను సమాజంలో నిలువుగాలని మండల వైద్యాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు మండలంలోని గోపగుడిపల్లి పంచాయతీ సచివాలయ పరిధిలో స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు, కిశోర బాలికలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఒ జహీరాబీ, సూపర్వైజర్ శివ సుబ్బమ్మ, హెల్త్ సూపర్వైజర్లు రేఖానాయక్, ఉమామహేశ్వరి, ఎంఎల్‌ హెచ్‌పి 104 సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానికసామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన వైద్య సదుపాయాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వ్యాధులను ముందుగా గుర్తించి అవసరమైన ఆరోగ్య సేవలను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ హసీనా పర్వీన్,డాక్టర్ వెంకటరామయ్య,డాక్టర్ దుర్గాదేవి,ఆసుపత్రి సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు. **కలకడ:** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కోనలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్య క్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్ ,వైద్య సిబ్బంది, మహిళలు, పాల్గొన్నారు. **నందలూరు:** ఆరోగ్యవంతమైన స్త్రీ-శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం ప్రారంభించడం ప్రారంభించినట్లు మండల ప్రభుత్వ వైద్య అధికారి శరత్ కమల్ పేర్కొన్నారు. ఆశా, ఆరోగ్య కార్య కర్తలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహిం చామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 70 మంది మహి ళలకు పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి సిహెచ్‌ఒ వెంకటనారాయణ, పి హెచ్ ఎన్, శైలజ, సూపర్‌వైజర్ సునీల్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు :** ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శారదమ్మ ఆధ్వర్యంలో గాలివీడు వన్ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సోనీ, సుజాత అంగన్వాడీ కార్యకర్తలు జరీనా, వెంకటరతాన్నమ్మ, కుమారి పాల్గొన్నారు. **పీలేరు:** మహిళలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న అన్ని రకాల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ తో చక్కటి అవకాశమని, ప్రతి మహిళా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తలుపుల పి.హెచ్.సి వైద్యాధికారులు డాక్టర్ శ్రీగిరీష, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. బుధవారం తలుపుల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీనివాసులు, కృష్ణయ్య, కుసుమ, ఏఎన్.ఎమ్ లు పాముని్నిసా, నాగవేణి, కృష్ణమ్మ, సిహెచ్‌ఓ చంద్రకళ, కుముద, లావణ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం : సిఐ

ప్రజాశక్తి-కలికిరి

మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరమని సిఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ పైన ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వాడకం శారీరకంగా, మానసికంగా నాశనం చేస్తుందని, డ్రగ్స్ అంటే డెత్ అనే నినాదంతో చైతన్యం కల్పించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం వంటి అలవాట్లు ఒకసారి మొదలైతే భవిష్యత్తును చీకటిలోకి నెడతాయని హెచ్చరిం చారు. అసాంఘిక కార్యక్రమాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్లు, ఒటిపి, పాస్వర్డ్ షేరింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై హెచ్చరికలు చేశారు.మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాపాయమే కాక చట్టపరంగా శిక్షార్హులు అవుతారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ రామాంజనేయరెడ్డి, డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ హేమ నారాయణరెడ్డి, కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు:** మండలంలోని శ్రీ రవిచంద్ర సిబిఎస్‌సి ఇంగ్లీష్ మీడియం స్కూల్, కాలేజీలో డ్రగ్స్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాలివీడు ఎస్ఐ పి.రామకృష్ణ విద్యార్థులతో మాట్లాడుతూ, డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం సమాజాన్ని నాశనం చేస్తోందని హెచ్చరించారు. విద్యార్థులు మత్తు పానీయాలు, డ్రగ్స్ లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, కష్టపడి చదువుకుని మంచి మార్కులతో పాస్ అయి తల్లిదండ్రులకు, గురువులకు గౌరవం తెచ్చేలా ప్రవర్తించాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అవగాహన పెంచేలా ముందడుగు వేయాలని కోరారు. **లక్కిరెడ్డిపల్లి :** గంజాయి , మత్తు పదార్థాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి సిఐ వెంకటకొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల లో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల పట్ల విద్యార్థులు దూరంగా ఉండాలని, బాగా చదువుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు పట్ల ప్రతి ఒక్కరూ మెలకువలు పాటించాలని, అనవసర వెబ్సైట్లను ఓపెన్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సహదేవ ఒడ్డి , ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ కృషారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఎస్ఐ సుబ్బరాయుడు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-నందలూరు : ఎఎస్ఐ సుబ్బరాయుడు సేవలు ఎనలేనివని రాజంపేట రూరల్ సిఐ బివి.రమణ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సుబ్బరాయుడు కు ఆత్మీయ అభినందన సభను ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయనను పూల మాల, శాలవాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ మండలంలోని ప్రముఖులు ఆర్ముగం విశ్వనాథ్, జంగం శెట్టి సుబ్బయ్య, కడవకూటి సంజీవ రాయుడు, కుర్ర మణి యాదవ్, అల్లం అశోక్ కుమార్, గురు ప్రసాద్, తోట కేదార్నాథ్, గురువిగారివాసు, కొట్టే శ్రీహరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అన్నమయ్య జిల్లా రాయచోటి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట గురువారం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు మదనపల్లె విద్యుత్ జెఎసి నాయకులు చైర్మన్ సయ్యద్ జాఫర్‌వల్లి , కో-చైర్మన్ రామ లక్ష్మయ్య, కన్వీనర్ పత్తి మురళి రామక్రిష్ణ, వైస్ చైర్మన్లు శేషాద్రి నాగరాజు, షేక్ జాఫర్ వలి , రామచంద్ర నాయక్ తెలిపారు. మదనపల్లె డివిజన్, రాజంపేట డివిజన్ నుంచి విద్యుత్ ఉద్యోగులు భారీ ఎత్తున హాజరై ధర్నా విజయవంతం చేయాలని కోరారు. 19, 20వ తేదీలలో రాయచోటి సర్కిల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు 22న 10 గంటలకు సర్కిల్ కార్యాలయం నుంచి ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు.

సమష్టి కృషితోనే పార్టీ బలోపేతం : ఎమ్మెల్యే


వైసిపి నాయకులతోమాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా కృషి చేసినప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని వైసిపి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డి పేర్కొన్నారు. తంబళ్లపల్లె ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులతో చర్చించారు. రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం గ్రామాలలో ప్రజా సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అందరం ఏకమై కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాక్షస పాలన సాధిస్తూ అక్రమ కేసులు బెదిరింపులు చేస్తూ సామాన్య ప్రజలకు తీరని మోసం చేస్తుందన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి అండగా నిలచాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి మహేష్, నాయకులకి శ్రీనివాసులు,నరేంద్ర రెడ్డి, శివారెడ్డి, కిషోర్‌రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.


స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఇఒలు, ఎంపిడిఒ,హెచ్‌ఎంలు

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎంఇఒలు పద్మావతి, నారాయణ, ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జడ్‌పి హైస్కూల్(తెలుగు) క్రీడా మైదానంలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఎంపిడిఒ పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణయ్యతో కలసి ప్రారంభించారు. 17వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిమ్మనపల్లెలో అండర్-14 విభాగంలో, అండర్-17 విభాగంలో బాల, బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయ న్నారు. మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖక్స, చెస్, బాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించామన్నారు. అండర్-17 బాలుర విభాగంలో వాలీబాల్ పోటీలో కేశవరెడ్డి పాఠశాల విజేతగా, రన్నర్‌గా రెడ్డివారిపల్లి జడ్‌పి హైస్కూల్, కబడ్డీలో విజేతగా బాలినాయనపల్లి, రన్నర్‌గా జడ్పీ హైస్కూల్ (తెలుగు), బాలుర విభాగంలో కబడ్డీలో జడ్‌పి హైస్కూల్ తెలుగు విజేతగా, రన్నర్‌గా మోడల్ స్కూ ల్, ఖోఖోలో కొమ్మిరెడ్డిగారిపల్లి జడ్‌పి హైస్కూల్ విజేతగా, రన్నర్‌గా మోడల్ స్కూల్ నిలిచాయన్నారు. 18వ తేదీన అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఅంజాద్‌అలీఖాన్, పిఇటిలు శారద, శ్రీనివాసులు, మణి, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అస్వస్థకు గురైన ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-చిన్నమండెం


శ్రీధర్‌రెడ్డి(ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని సాకి బండ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు బివి శ్రీధర్‌రెడ్డి(55) బుధవారం పాఠశాలలోఅస్వస్థత గురై ఆసుపత్రికి చేరేలోపు మృతి స్థానికలు తెలిపారు. సంబేపల్లి మండలంలోని మోటుకు వాండ్లపల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావం కలవాడని, ఇతని మృతి పట్ల తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడి కుటుంబంలో విషాదం అలుముకుంది.

క్రైం కార్నర్

ఆర్‌టిసి బస్సు, బైక్ ఢీ : మహిళ మృతి

ప్రజాశక్తి-కలికిరి

ఆర్‌టిసి బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీకి చెందిన నూరుల్లా ఆయన భార్య షరీఫా(40) ఇందిరమ్మ కాలనీ నుంచి పట్టణంలో ఉన్న బ్యాంకులో పని నిమిత్తం వచ్చి తిరిగి వెళుతుండగా టిబి రోడ్‌లోని ప్రసాద్ థియేటర్ సమీపంలో మదనపల్లి2 డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో భార్య భర్త ఇద్దరు రోడ్డు పైన పడిపోయారు. స్థానికులు బాధితులను కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే షరీఫా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త నూరుల్లాకు స్వల్ప గాయాలు అ య్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ అనిల్ కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-కలికిరి


బాలాజీ(ఫైల్ ఫొటో)

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ తెలపాలంటూ కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు కలికిరి టౌన్ రెడ్డివారిపల్లి, సంత గేటు వీధిలో నివాసమున్న సి.బాలాజీ(33) ఈనెల 14న ఇంటి నుండి వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతనికి మానసిక స్థితి సరిగా లేనందున ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు క్రింద తెలిసిన వారు సి.రసూల్ సాహెబ్ ఎల్ఐసి ఏజెంట్ 8500130283, సి.రహీం (పండ్లవ్యాపారి)9441116527 మొబైల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కలకడ వాసి మృతి

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో కలకడ మండల వాసి మృతి చెందిన సంఘటన సంబేపల్లి మండలం పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎగువ పల్లెకు చెందిన భాస్కర్ రెడ్డి తన ద్విచక్ర వాహనంలో రాయచోటి వైపు వెళుతుండగా, చిత్తూరు -కర్నూలు జాతీయ రహదారిలో ఉన్న కలకడ, సంబేపల్లి మండలాల సరిహద్దులో రాయచోటి నుంచి పీలేరు వైపు వెళున్న కారు ఢీకొన్న ఘటనలో భాస్కర్ రెడ్డి ప్రమాద స్థలంలోనే మృతి చెందినట్లు సంబేపల్లి ఎఎస్ఐ బాదుల్లా తెలిపారు. కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.